కథా నిలయం
3576
శ్రీకాకుళం

# చీకటి వెలుగులు

"మొన్న మన ఊరికి ఆఫీసును తనిఖీచెయ్యటానికి వచ్చిన ఆఫీసరు మన ఊరివాడేనటగా ?"

లక్ష్మీకాంతం మర్రిచెట్టుక్రింద చేరిన నలుగురితో ఉబుసుపోని మాటలలో ఒక మాటగా అన్నాడు.

''మన ఊరివాడా ? ఎవరి తాలూకు ? నేనెరిగినంతవరకూ ఈ ఊళ్ళో అంత చదువు చదివి సబ్ కలెక్టరయిన వాడిని ఒక్కరినయినా చూడలేదు. మన ఊళ్ళో స్కూలున్నది, కాలేజి ఉన్నది. కాని పొరుగూరినుంచి వచ్చి, చదువుకుని వెళ్ళిపోయిన వాళ్ళు చాలామందిని చూశాను. మన ఊరివాళ్ళు మెట్రిక్ ప్యాసయితే గొప్ప'' అన్నాడు రమణయ్య.

"ఎందుకని ?"

"మన ఊళ్ళో చాలామందికి పొలాలున్నాయి. పెద్దలు కట్టిన మేడలూ పెంకుటిళ్ళూ ఉన్నాయి. చుట్టుపక్కల ఊళ్ళల్లో పళ్ళతోటలు కూరగాయలతోటలూ ఉన్నాయి. కొందరు మెట్రిక్ వరకూ చదువుకోవటమూ ఈ వ్యాపారాలు చేసుకోవటమూ చూస్తున్నాం గాని కాలేజిలో ప్రవేశించిన వాళ్ళూ తక్కువ ఇక్కడ ఉన్న కాలేజీచదువయినా ముగించిన వారు లేనేలేరు" అన్నాడు రమణయ్య.

''ఆ కొత్తగా వచ్చిన సబ్ కలెక్టరు రెండేరోజులుండి, గెస్టుహౌస్‌లో బసచేసి, ఆఫీసుపని చూసుకుని వెళ్ళిపోయాడు ఒక వారం రోజులుండి ఆఫీసుకు వస్తూ పోతూ ఉంటే కొందరికయినా తెలిసేది. ఇప్పుడా అవకాశం లేకుండాపోయింది" అన్నాడు లక్ష్మీకాంతం

''ఆ శివకామయ్య ఇద్దరు మగపిల్లలూ చదివారు హైస్కూలు వరకూ. కాని అరటిగెలల వ్యాపారం చేసేవాళ్ళ చేతికింద ఉన్నారు"

మర్రిచెట్టునీడన చల్లటిగాలి వీచేసమయానికి లక్ష్మయ్యవచ్చి చేరుకున్నాడు. వీళ్ళకంటె కాస్త పెద్దవాడు, ఆ ఊరి వాళ్ళకు ఎంత ఆస్తి ఉన్నదీ, ఎంతమంది పిల్లలున్నదీ కొంత తెలిసినవాడు. వాళ్ళ పిల్లలకు ఏ ఊరివాళ్ళతో పెళ్ళిళ్ళయిందీ స్వయంగా చూడకపోయినా వినికిడి వల్లనైనా తెలుసుకున్నవాడు లక్ష్మయ్య.

"మన శివకామయ్యకొక తమ్ముడుండేవాడు కదూ! మీరెవరూ చూసి ఉండరు. ఆ తమ్ముడు మనఊరి హైస్కూల్లో చదువుముగించి వారినీ వీరినీ ఆశ్రయించి, తాలూకాఫీసులో చిన్న ఉద్యోగమొకటి సంపాదించాడు. శివకామయ్య ఏడవక్లాసు దాటలేక వ్యవసాయం చెయ్యటం మొదలుపెట్టాడు. వాళ్ళకు ఐదు వందల గజాలస్థలంలో ఒక పెద్ద పెంకుటిల్లు ఉండేది. వాళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయినా తల్లి ఉన్నంతవరకూ కలిసే ఉన్నారు. తల్లి పోయేనాటికి శివకామయ్య తమ్ముడు గురుమూర్తి తాలుకాఫీసులో పనిచేస్తూ ఉండేవాడు.

తల్లి చనిపోయిన తరువాత ఊరిపెద్దలు వాళ్ళకు సమ్మతంగా భాగాలు పంచారు. చదువు తక్కువైన శివకామయ్యకు ఒకటిన్నర ఎకరం భూమి, చాలా చిన్నదయినా ఉద్యోగిగా పేరుతెచ్చుకున్న గురుమూర్తికి పెంకుటిల్లూ పంచారు.

ఆ ఏర్పాటు ఇద్దరికీ అప్పటికి సమ్మతంగానే ఉంది.

శివకామయ్యకు నలుగురు పిల్లలలో ఇద్దరు మగపిల్లలు. ఆ పిల్లలనిద్దరినీ స్కూల్లో చేర్చి చదివించినా వాళ్ళకు స్వయంగా చదువుకోవాలని లేకపోవటంచేత వాళ్ళు మెట్రిక్ దాటలేకపోయారు. ఎదుగుతున్న పిల్లలు వ్యాపారమయినా తెలుసుకుంటారని దానిలోకి దించాడు శివకామయ్య. గురుమూర్తికి ఒక్కడే కొడుకు. భార్య బస్తీనుంచి వచ్చింది. పిల్లవాడిని ఇటూ అటూ తిరగనీయకుండా పుస్తకాలు ముందరవేసి కూర్చోబెట్టేది.

శివకామయ్య భార్య చదువుకోకపోయినా లౌకికజ్ఞానం కలది.

"మనం విడిపోయామన్న పేరేగాని ఒక్కచోటే ఉంటున్నాము. తమ్ముడితో మాట్లాడు" మని పోరుతూ ఉండేది.

ఒక రోజున- అంటే ఆరోజు ఆదివారం. గురుమూర్తి స్తిమితంగా ఇంట్లో ఉండి బజారు పనులూ పిల్లవాడి చదువుసంగతీ చూసేరోజది.

''గురుమూర్తీ, మనం భాగాలు పంచుకున్నామన్న పేరేగాని అమ్మ ఉన్నప్పుడు ఉన్నట్టే ఉన్నాము. ఇన్నాళ్ళకు నాకు కొంత అనుభవంలోకి వచ్చింది. ఇల్లొకరూ పొలమొకరూ తీసుకుంటే అననుకూలమే ఎక్కువగా ఉన్నట్టు కనబడుతోంది. అందుకని ఇల్లు చెరిసగం చేసుకుందాం. పొలం చెరిసగం చేసుకుందాం. మధ్య హాలుకు ఇటు మూడుగదులూ నేను వాడుకుంటాను. అటు మూడుగదులూ నీవు వాడుకో. హాల్లో సగానికి తడకకట్టిస్తే సగం నీకు కలిసివచ్చేది నీవువాడుకో, నాకు కలిసివచ్చేది నేను వాడుకుంటాను. పొలంమీద వచ్చిన పంటలో నీవు పని చేసేవాడివి కావు కనుక రెండుభాగాలు నాకు ఒకభాగం నీకు. నేను పూర్తిగా వ్యవసాయంచేసి నీభాగం ధాన్యమిస్తా. ఏమంటావు ? సబబుగా ఉందా నామాట ?" అన్నాడు వ్యవసాయం బాగా తెలిసిన శివకామయ్య.

''ఇంతవరకూ నాకు బాగాతెలుసు. తరువాత ఏమయిందో ?" అన్నాడు లక్ష్మయ్య.

ఆ తరువాత జరిగిన సంగతి

సరేనని ఒప్పుకున్నాడు గురుమూర్తి. ఆనాటినుంచీ ఎవరి వంటలు వారివి. గురుమూర్తి ఆఫీసునుంచి రాగానే గ్లాసెడు మంచినీళ్ళు తాగి తన పిల్లవాడు మహేంద్రతో పాటు అన్నగారి పిల్లలకు కూడా వీధి వసారాలో చాపమీద కూర్చోబెట్టి చదువు చెప్పేవాడు. శివకామయ్య పొలంలోకాసిన దోసకాయలు గోంగూర వంటివి తెచ్చి తమ్ముడికి కూడా ఇచ్చేవాడు. గురుమూర్తి భార్య పెరట్లో పండించిన కూరలు బావగారింటికి కూడా అందచేసేది.

ఇలా సామరస్యంగా ఎక్కువకాలం గడవకుండా గురుమూర్తికి ఆఫీసులో కదలిక వచ్చింది. అతడిపై ఆఫీసరుకు బదిలీ వచ్చింది. ఆయనకు మొదటినుంచీ సన్నిహితంగా ఉంటూ ఆఫీసుపనులూ ఇంటిపనులూ చేసే గురుమూర్తికి కూడా తనతోపాటు బదిలీ చేయించాడు.

అప్పుడు గురుమూర్తి తన భాగం ఇంటిని తెలిసిన వాళ్ళకు అద్దెకిచ్చి, శివకామయ్య తనకిచ్చిన ధాన్యాన్ని దంపించి, వెంట తీసుకువెళ్ళాడు. కొడుకును ఆ ఊళ్ళో ఉన్న స్కూల్లో చేర్చాడు.

గురుమూర్తి కొత్తఊరు వచ్చిన తరువాత తనకు తగిన ఇల్లొకటి అద్దెకు

తీసుకున్నాడు. తన ఊరినుంచి వచ్చిన బియ్యం వాడుకుంటూ ఉండేవాడు. తన ఇంటి అద్దె వచ్చినప్పుడు దానితో పప్పు ఉప్పూ కొనుక్కునే వాడు. కాని తన ఊళ్ళో ఉన్నట్టు ఉండేది కాదు. కూరలు కొనుక్కోవాలి. వచ్చిన అద్దెకు ఇక్కడి అద్దెకు సగానికి సగం తేడాఉంది. తన కొడుకు మహేంద్రకు పుస్తకాలు ఫీజు కట్టవలసి ఉంది. కొంచెం ఇబ్బందనుకుంటాడు.

గురుమూర్తి ఆ ఊరు వచ్చినప్పటినుంచీ ఆఫీసునుంచి ఒక్కదారినే ఇంటికి వస్తాడు. దారిలో బ్యాంకిలో పనిచేసే ఆఫీసరు ఇంటిమీదుగా తన ఆఫీసుకు వెళ్ళి వస్తూ ఉండేవాడు. ఒకనాడు బ్యాంకు ఆఫీసరు వాకిట్లో నిలబడి ఉండగా చూసి, నమస్కారం పెట్టాడు. ఎవరో తెలియకపోయినా ఆయనకూడా ప్రతినమస్కారం చేశాడు. ఇలా కొన్నాళ్ళు గడిచాక ఆయనతో పరిచయం చేసుకుని తన కొడుకు మెట్రిక్ పరీక్ష రాసేడనీ ఏదైనా ఉద్యోగమిప్పించమని కోరాడు.

"పరీక్ష పాసవుతాడు గాని మెట్రిక్ చదివినవాడికి ఏం ఉద్యోగమొస్తుంది? కష్టపడితే అటెండరు పని దొరుకుతుందేమో ? చిన్నవాడేగా ? ఇంటరు చదవ నీయండి. గ్రాడ్యుయేటు కూడా అయితే బ్యాంకులో పెట్టించవచ్చు. బి.కామ్ లో చేర్పిస్తే మంచిది" అని సలహా ఇచ్చాడు.

గురుమూర్తి పిల్లవాడిని కాలేజిలో చేర్చి అతడు కోరిన బట్టలు కొంచెం ఖర్చయినా కుట్టించి పుస్తకాలు కొనిపెట్టాడు.

అతడికి వరసగా ఆరేడు నెలలు అద్దె ఏంవచ్చిందో అంతే, ధాన్యం కూడా అందటం లేదు. గురుమూర్తికయినా ఎంత జాగ్రత్తగా డబ్బువాడినా చాలక పోయేది. అన్నగారికి గౌరవంగానే ఉత్తరం రాశాడు. తనకు తన అద్దె పంప వలసిందనీ, ధాన్యం కూడా అనుకున్నట్టుగా పంపవలిసిందనీ తనకు డబ్బు ఇబ్బందిగా ఉంటోందికనుక ఆలస్యం చేయవద్దని రాశాడు.

తమ్ముడి ఉత్తరానికి, నాలుగురోజులు భార్యతో సంప్రదించి, "పంటలు సరిగా పండటం లేదు. ఖరీదయిన ఎరువులను కొని వేయించకపోవటమే అందుకు కారణం. నేను పిల్లలతో చాలా అగచాట్లు పడుతున్నాను. ఇంక అద్దెసంగతి. అది వరకూ ఉన్నవాళ్ళు వెళ్ళిపోయారు తరువాత అద్దెకు ఎవరూ రాలేదు. వస్తే పంపుతూ ఉంటాను. మహేంద్ర మరదలు క్షేమసమాచారాలు రాయి'' అని జవా బిచ్చాడు.

గురుమూర్తి కొడుకు తండ్రి పడుతున్న కష్టాలను గమనించి తను డబ్బు ఎక్కువగా ఖర్చుచెయ్యకుండా పాతపుస్తకాలు కొనుక్కుని, లైబ్రరీ నుంచి పుస్తకాలు తెచ్చి చదువుకునేవాడు. తల్లిని కూడా ఇబ్బంది పెట్టకుండా తన బట్టలు తానే ఉతుక్కుని ఇస్త్రీ చేసుకునేవాడు. లేమి అనుభవిస్తున్నా పైకి కనబడనీయ కుండా మసలుకునే వాడు.

గురుమూర్తి నాలుగురోజులు స్వగ్రామంవెళ్ళి అక్కడి పరిస్థితులను కంటితో చూడాలనుకున్నాడు. అన్నగారింట్లోనే దిగితే యథాస్థితి తెలియక పోవచ్చునని తన చిన్ననాటి స్నేహితుడింట్లో దిగాడు. మా పొలంలో పంటలెట్లా ఉన్నాయని స్నేహితుడిని అడిగాడు.

"మీభూమి ఒకటిన్నర ఎకరమయినా సుక్షేత్రం. నీటివసతి బాగా ఉన్నది. సంవత్సరానికి మీ అన్న మూడు పంటలు తీస్తున్నాడు. వాళ్ళ ఖర్చుకు పోను మిగతాధాన్యం మా దుకాణానికే వస్తుంది" అన్నాడు.

మాకు ఇబ్బందిగానే ఉందోయ్. మా యింట్లో ఎవరూ అద్దెకు రావటం లేదని రాశాడు మా అన్న. నేను అక్కడ అద్దెపెట్టినదీ ఇల్లురాదుకదా. మాకు ఒక్కపిల్లవాడు. వాడు ఎంతవరకూ చదువుతానంటే అంతవరకూ చదివించా లనుకున్నాను. చదువు బాగాఉంటే పెద్దఉద్యోగం వస్తుందన్న ఆశ ఉంటుంది కదా?''

"అవును. కొందరికి చెప్పించాలన్నా చదువురాదు. నీకొడుకు చురుగ్గా చదువుతున్నాడు. అటువంటప్పుడు చదువు చెప్పించవలసిందే. ముందుతరమైనా అభివృద్ధిలోకివస్తుంది. మీ యింట్లోకి అద్దెకు ఎవరూ రావటంలేదని అన్నావు. మధ్యలో ఉన్న తడకలిప్పేసి తనే వాడుకుంటూ ఎవరూరాలేదంటే ఎట్లావస్తారు? ఆ యింట్లోకి మీ అన్నయ్య ఎవరినీ అద్దెకురానివ్వడు. అసలు సంగతి అది." అన్నాడు మిత్రుడు.

"మేమాబస్తీలో ఎన్ని ఇబ్బందులు పడుతున్నామో మా అన్నకుతెలియదు. నా కేదయినా ఉపాయంచెప్పు" ప్రాధేయపూర్వకంగా అడిగాడు గురుమూర్తి.

"అది నీయిల్లు. నీ భాగానికి పెద్దలంతాకలిసి పంచియిచ్చినదేకదా. మధ్యలో మీలో మీరేదో సర్దుబాటు చేసుకున్నారు. దానివల్లలాభం కలగలేదు. దానిని అమ్మ

కానికి పెట్టు. ఐదువందల గజాలుగల పెద్ద పెంకుటిల్లు. ఇప్పటికీ చెక్కు చెదర లేదు. ఈ ఊళ్ళోనుంచి వెళ్ళిపోయాడుకదా అని అనుకున్నాడేమో మీ అన్న. అంతా తనే అనుభవించవచ్చని ఆశకలిగింది. రేపువెళ్ళి ''నా యిల్లు నేను అమ్ముతాను. అందుకేవచ్చాను. ఊరిపెద్దలూ వర్తకులు ధరకడతారు. నాకు నచ్చిన ధరకు అమ్మి వెళ్ళిపోతాను'' అని చెప్పు. ఈలోపల మేము పదిమందిమివచ్చి ధర సెటల్ చేస్తాము. అతడికి కావాలంటే అతడినే కొనుక్కోమను. లేదా మేము కొంటాము అన్నాడు మిత్రుడు.

మరునాడు గురుమూర్తివెళ్ళి తనకు డబ్బవసరము వచ్చింది కనుక ఇల్లు అమ్మదామని వచ్చాననీ, మరి కాసేపటికి వర్తకులువచ్చి ధరకడతారు. ఆ ధరకు ఎవరయినా కొనుక్కోవచ్చునని చెప్పాడు. అన్నగారు ''పెద్దలనాటి ఇల్లు ఎందుకమ్మాలి? ఏదయినా అవసరంవస్తే ఇల్లు అమ్ముకుంటారా? అందులో నేనుంటున్నాను ఇప్పుడు" అన్నాడు. ఒదినెగారువచ్చి "ఇల్లు అమ్మటానికి వీలులేదు. మేము పిల్లలుగలవాళ్ళము'' అన్నది ఖండితంగా.

ముందుగా ఏర్పాటుచేసుకున్నట్టుగా వకీలుతోపాటు వర్తకులు వచ్చారు. అందరూకలిసి ధరకట్టారు నలభయిఐదువేలని. వకీలు "నీ భాగం ఇల్లు నీకు అమ్ముకునే అధికారముంద"ని కాగితాలు చూపించాడు.

అన్న తిట్టిపోశాడు. ఒదినెగారు మెటికలు విరిచింది. ఊరంతా ఒక్కటైనారు. ఇల్లు అమ్ముడుపోయింది. కొన్నవాళ్లు ఒక నెలలో ఖాళీచెయ్యమన్నారు. డబ్బుతీసుకుని రిజిస్టరుచేసి గురుమూర్తి వెళ్ళిపోయాడు.

అన్నకు ఒదినెకూ కంఠం బిగించినట్లయింది.

మనసులో ఇద్దరూ చెరొకవిధంగా తిట్టుకున్నారు.

మహేంద్రకు తన చదువును తప్పించి మరొక ఊహ మనసులో మెదిలేది కాదు. ఒక్కొక్కరోజున-తండ్రినికూడా చూడటానికి వీలులేకుండా తన పనిమీద వెళ్ళిపోయేవాడు. తన చదువుకయ్యే ఖర్చులు తను సంపాదించుకోవాలన్న భావం అతడిలో బాగా పాతుకుపోయింది. అందుకే ఉదయం ఆరుగంటలనుంచీ తొమ్మిది గంటలవరకు కొందరి పిల్లలకు ట్యూషన్‌లు చెప్పేవాడు. తిరిగి సాయంత్రం కాలేజినుంచి వచ్చిన తరువాత ఏదో ఇంత టిఫిన్‌తిని మళ్ళీ ట్యూషన్లు చెప్పేవాడు ఎనిమిది గంటలవరకూ.

గురుమూర్తి మళ్ళీ బ్యాంకి ఆఫీసరు దగ్గరికి వెళ్ళాడు నమస్కారంచేస్తూ.

"ఏమిటండీ. మీరీ మధ్య ఊళ్లోలేరా ఏమిటి? బదిలీఅయి వెళ్ళిపోయారేమో ననుకున్నాను. ప్రకటన వచ్చింది పరీక్షలయ్యాయి. సెలక్షనుకూడా అయింది. నేను మీరు వేళకు రాలేదేమని ఎంతో బాధపడ్డాను" అన్నాడు.

గురుమూర్తి "నాకు అదృష్టంలేదు. దానికి మీరేంచేస్తారు?" అన్నాడు.

"అయినదేదో అయిపోయింది మీ అబ్బాయికేమీ నష్టంలేదు. ఎం.కామ్ చదవమనండి. అప్పుడు ఈ బ్యాంకిఉద్యోగాలు ఒక లెక్కా? ఎన్నోరకాల పోటీ పరీక్షలు జరుగుతాయి. ఎందులోనయినా మీ అబ్బాయి సెలక్టు కావచ్చు" అన్నాడు.

ఇంతలో గురుమూర్తికొక కష్టంవచ్చింది. భార్యకు నెలరోజులనుంచీజ్వరం చిన్న డాక్టర్లు ఇచ్చిన మందులతో తగ్గలేదు. పెద్దాసుపత్రికి తీసుకువెళ్ళితే అక్కడ ఎక్సురేతీసి "క్షయవ్యాధి"అని చెప్పారు. "క్షయవ్యాధికి ప్రత్యేకమైన హాస్పిటల్ ఉంది. దానిలో చేర్పించండి" అన్నారు.

వెంటనే క్షయవ్యాధి హాస్పిటల్లో చేర్పించాడు. అక్కడ ఇంజక్షనులు, పాలు, గ్రుడ్లు మందులు ఇస్తున్నారు. ఒక నెలయ్యేసరికి జ్వరం తగ్గి, మనిషికి మామూలు రూపువచ్చింది. కాని కొంత కాలంపాటు తీసుకోవలసిన చికిత్సఅది. మహేంద్ర వీలుకలుగచేసుకుని రోజుకొకసారయినా వెళ్ళి చూసివచ్చేవాడు. గురుమూర్తి ఆఫీసునుంచి ఇంటికివచ్చి వంటచేసేవరకూ ఆలస్యమయ్యేది. అందుచేత ఆదివారాలు మాత్రమే వెళ్ళి చూ సేవాడు.

అతడి భార్య శ్రీమతి తనకోసం డబ్బు చాలా ఖర్చవుతున్నదని బాధ పడేది. గురుమూర్తి రోజూ వంటచేయవలసి వచ్చిందనీ అతడు అందుకనే ప్రతి రోజూ రాలేక పోతున్నాడనీ కన్నీళ్లు తెచ్చుకునేది.

ఆమెకు మాత్రం చికిత్స ఎప్పటిమాదిరిగా జరుగుతున్నది.

డబ్బు మంచినీళ్ళలా ఖర్చవుతున్నదని గురుమూర్తికంటె ఆమె ఎక్కువ బాధ పడుతున్నదని తెలిసి అతడు అక్కడికి చూడటానికి వెళ్ళినప్పుడు కోప్పడేవాడు-"ప్రాణంకంటె డబ్బు ఎక్కువా?" అని.

గురుమూర్తి తన ఆఫీసరుకు తన కష్టాలన్ని చెప్పుకొని, భార్య జబ్బుని గురించి కూడా వివరించాడు.

"నీవు వట్టి వెర్రివాడవోయ్ గురుమూర్తీ! అందుకే నిన్నందరూ మోస పుచ్చుతారు. నీవు సత్యకాలం మనిషివి. మీ అబ్బాయిని నా దగ్గరికి పంపించు పోటీపరీక్షల పద్ధతులన్నీ చెబుతాను- ఢిల్లీలో కోచింగ్ క్లాసులు నడుస్తాయి. ఇదిగో వాళ్ళ ఎడ్రసు. ఎప్పటినుంచీ ప్రారంభమవుతాయో రాసి తెలుసుకోమను. అక్కడ ఉండటానికి వెంకటేశ్వర హైస్కూలుంది. వాళ్ళను మంచిచేసుకుని పడుకోవటానికి చోటివ్వమంటే ఇవ్వకపోరు. అది మన ఆంధ్రులదే. ఆంధ్రులే నడుపుతున్నారు. బ్యాంక్ ఆఫీసరుకు ముడుపు చెల్లించుకున్నావా?" అడిగాడు.

గురుమూర్తి మాట్లాడలేదు.

"ఇచ్చే ఉంటావు. ఒక పక్క భార్యకు క్షయ అంటున్నావు. మరొక పక్క కొడుకు ఉద్యోగంకోసం డబ్బు ఖర్చుచేస్తున్నావు. నీ దగ్గర ఎంత దోచు కున్నాడో ఆయన? ఒక్కరినైనా సిఫారసుచేసి ఎరగడని పేరు ఆయనకు. పిల్ల వాడు యువకుడైనాడు. బాగా చదివాడు. పోటీపరీక్షలు ఎన్నో జరుగుతాయి. ఏ ఒక్కదానికయినా సెలెక్టు కావచ్చు. అతడిని గురించి నీవు దిగులు పెట్టుకోకు. నీ భార్యను జాగ్రత్తగా చూసుకో. ఇప్పుడు ఆ వ్యాధికి కూడా మంచి మందులు వచ్చాయి. నయమవుతుంది. శ్రద్ధతో మందిప్పించు" అన్నాడు.

గురుమూర్తి బ్యాంకి ఆఫీసరుకిచ్చిన వెయ్యిరూపాయలకూ తిలోదకాలిచ్చి వెనక్కు మళ్ళాడు.

"నాన్నా! అయిన ఖర్చు చాలు. నీవు మిగిలిన డబ్బు బ్యాంకులో పెట్టు కుని అమ్మను చూసుకో. నేను ఏదోవిధంగా నా సంగతి చూసుకుంటాను. మళ్ళీ ఆ బ్యాంకు ఆఫీసరు దగ్గరికి వెళ్లకు. ఆ బ్యాంకులో డబ్బు కూడా పెట్టకు" అన్నాడు.

ఆ సంవత్సరమంతా మహేంద్ర పిల్లలకు ట్యూషన్లు చెపుతూనే ఎం. కామ్ చదివాడు. పరీక్షాఫలితాలు రాగానే ఢిల్లీకి ప్రయాణమవుతూ తల్లి దగ్గరకు వెళ్ళాడు.

ఆమె మనిషి పైకి బాగానే కనబడ్డది. మహేంద్ర ఏదో ఒక సమయంలో

తల్లిని చూస్తూ ఉండేవాడు. ఇప్పుడా తల్లిని వదిలిపెట్టి వెళ్ళాలంటే మనసులో బాధగా ఉంది.

అతడు వెళ్ళేసరికి ఆమె నిద్రపోతున్నది. ఆమె లేచేవరకూ ఆగి తన సంగతంగా చెప్పి "అమ్మా నీకు వారానికి రెండు ఉత్తరాలు రాస్తాను. నీవు ధైర్యంగా ఉండు. ఇక్కడ నీకు మంచి మందులూ ఆహారం ఇస్తారు. మనసులో ఎవరిమీదా బెంగ పెట్టుకోకు. నేను ఢిల్లీ వెళ్ళి చదువుకుంటాను. నీ ఆశీర్వచన బలమే నాకు శక్తినిస్తున్నది."

"మహీ, మన కుటుంబం ఎట్లా ములుపుతిరిగిందో ననుకుంటే బాధగా ఉందిరా. నాన్న అక్కడ. నేను హాస్పిటల్‌లో-నీవు ఢిల్లీలో. ముగ్గురం మూడు చోట్ల. నాన్న రోజూ రాలేరు. రాలేదని నాకు బెంగ. కాని ఆఫీసునుంచి వచ్చే సరికే ఆలస్యమవుతుంది. ఇంత దూరం వచ్చి మళ్ళీ ఇంటికివెళ్ళి వంటచేసుకుని భోజనం చెయ్యాలి. మనకు మంచిరోజులు ఎప్పటికయినా వస్తాయా అనిపిస్తుంది. కాని నీవు మాత్రం నీ చదువుమీదనే దృష్టి పెట్టుకో." కళ్ళు తుడుచుకుంటూ కొడుకు తలమీద చెయ్యివేసి నిమిరింది.

ఒక గంట సేపు తల్లిదగ్గరుండి మహేంద్ర ఇంటికి వచ్చాడు. మరునాడు ఉదయం ఢిల్లీకి ప్రయాణమయ్యాడు.

ఢిల్లీలో అతడికి తెలిసిన ముఖము ఒక్కటైనా లేదు. అతడి మనోధైర్యమే అతడికి తోడుగా నిలిచింది. హాస్టల్లో గాని హోటల్లోగాని ఉండి చదువుకునే పరిస్థితి లేదు. వెంకటేశ్వర హైస్కూలు హాస్టల్లో ఉండవచ్చు గాని భరించలేడు. రొట్టెలు కొనుక్కుని తిని హైస్కూలు వాచ్‌మెన్‌ని మంచిచేసుకుని అప్పుడప్పుడు డబ్బు ఇస్తూ అక్కడ పడుకునేవాడు. ఆ దీపాలవెలుగులో చదువుకునేవాడు.

అతడు ఐ.ఎ.ఎస్. కోచింగ్ సెంటర్‌కి వెళ్ళి ఆ ప్రిన్సిపల్‌ని కలుసుకుని ఫీజు కట్టి చేరాడు. చదవటం ప్రారంభించాడు.

ట్యూషన్లు చెప్పేవాళ్ళుండాలి గాని చెప్పించుకునే పిల్లలు అక్కడ చాలా మంది కనపడ్డారు. ఒక అద్దెసైకిలు తీసుకుని వీలైనంతమందికి చెబుతూ ఉండేవాడు. తన క్లాసులకు హాజరయ్యేవాడు. తీరిక చేసుకుని తల్లికీ తండ్రికీ ఉత్తరాలు రాస్తూ ఉండేవాడు.

అతడు పరీక్ష రాసి ఇంటికి వచ్చేటప్పటికి తండ్రి టైఫాయిడ్ జ్వరంతో పడుకుని ఉన్నాడు.

"నాన్నా! ఏమయింది? ఎన్నిరోజులనుంచీ ఈ పడక? మందు తీసుకుంటు న్నావా?" ఇంటికి రాగానే ఎదురుగా వస్తాడనుకున్న తండ్రి నీరసంతో మంచం మీద పడుకున్న వాడిని చూడగానే అతడికి భయం పుట్టింది. వెంటనే అతడిని ప్రభుత్వాసుపత్రిలో చేర్చి భోజనం చేసి తల్లిదగ్గరికి వెళ్లాడు.

"నాన్న ప్రతివారం వచ్చేవారు. ఇప్పుడు రావటంలేదు. ఎట్లా ఉన్నారో చూశావా?" అని అడిగింది తల్లి. ఆమెకు కొడుకును చూసిన సంతోషము కలగక పోగా దుఃఖం వచ్చింది.

"అమ్మా! నాన్నకు ఆఫీసులో పనిఉండి రాలేకపోయానని చెప్పమన్నాడు. ఇప్పుడు నేను వచ్చానుగా? రోజూ వస్తూఉంటాను. నీవు ధైర్యంగా ఉండు. మందులూ ఆహారం బాగా తీసుకుంటున్నావా? నేను డాక్టరుతో మాట్లాడతాను" ఆమెకు ధైర్యం చెప్పి డాక్టరుతో మాట్లాడడానికి వెళ్లాడు.

ఆమె వ్యాధి తగ్గుముఖానికి వచ్చింది. ఇంటికి తీసుకెళ్ళినా ఆమెని ఈ విధంగానే చూసుకోవాలి. ఆహరలోపం ఉండకూడదు. మందులు మానకూడదు. అప్పుడప్పుడు వచ్చి చూపించుకుంటూ ఉండాలి" అని జాగ్రత్తలు చెప్పాడు. కాని మహేంద్ర ఆమెను అక్కడే ఉంచాడు.

తండ్రి హాస్పిటల్‌లో డాక్టర్ల సమక్షంలోనే ఉన్నాడు. కాని టైఫాయిడ్ జ్వరం తగ్గినట్టే తగ్గి తిరగపెట్టింది. చిక్కి శల్యమైనాడు.

హాస్పిటల్లో తల్లడించిపోతున్న తల్లికి ఆ మాట చెప్పటానికి అతడికి మన స్కరించలేదు. వీలయినప్పుడు తండ్రిదగ్గరే ఎక్కువసేపు ఉండేవాడు.

టి.బి. హాస్పిటల్ డాక్టరు ఇంటికి వెళ్ళవచ్చని చెప్పాడని తల్లి ఉత్తరం రాసింది, ఆమె భర్తను చూడాలని చాలా తహతహలాడిపోతున్నది.

ప్రతిరోజూ వెళ్ళినట్టే తండ్రిదగ్గరకు వెళ్ళాడు మహేంద్ర. అప్పుడే గురు మూర్తికి ప్రాణంపోయినట్టుంది. ఆ మంచం ఖాళీచెయ్యటానికి వార్డుబాయిస్ తొందరపడుతున్నారు. శవాన్ని స్ట్రెచర్‌మీద పడుకోబెట్టారు. ఇంక అక్కడినుంచి శవాలనుంచే చోటికి తీసుకెళ్తారు.

మహేంద్రకు ఆ సమయంలో ఏంచేస్తారో కూడా తెలియదు. అతడికి ఆఫీసరు ఒక్కడే బాగా పరిచయం, చనువూను. తండ్రిపట్ల అభిమానం గలవాడు. వెంటనే ఆయనకు టెలిఫోను చేసి పరిస్థితులను వివరించాడు. ఆఫీసరు ఒక గుమాస్తాకు ఆరోజు సెలవు ఇచ్చి హాస్పిటల్‌కి పంపించాడు.

అతడిని చూడగానే మహేంద్ర బావురుమని ఏడ్చాడు.

"నన్ను ఆఫీసరుగారు నీకోసమే పంపించారు. నీవు ధైర్యంతెచ్చుకో. నీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు మీ నాన్న. నీ పరీక్షాఫలితాలూ సెలక్షను తెలియకముందే కన్నుమూశాడు. నేను నీకు తోడుగా ఉండటమే కాదు - చేయవలసిన పనంతా చేస్తాను. నిన్ను ధైర్యంగా ఉండమన్నారు" అని ఆ గుమాస్తా శవాన్ని యింటికి తీసుకువచ్చి యధావిధిగా కార్యక్రమాలు ముగించాడు. మహేంద్రకు అన్నం వండిపెట్టి భోజనం చేసినతర్వాత ఇంటికి వెళ్ళాడు.

ఆఫీసునుంచి ఇంటికి వెళ్తూ ఆఫీసరు వచ్చాడు. మహేంద్ర ఆయనను పట్టుకుని ఏడ్చాడు.

"నా కోసం ఎంతో తాపత్రయపడిన తండ్రి ఇంక లేడు. ఇంక నాకు సెలక్షన్ వచ్చినా ఏం సంతోషం" అని ఏడ్చాడు,

"అమ్మగారు ఎట్లా ఉన్నారు ? వెళ్ళి చూశావా?" అతడిని ఊరడిస్తూ అడిగాడు ఆఫీసరు.

"ఆమెకు జబ్బు తగ్గిపోయింది. ఇంటికి తీసుకువెళ్ళమన్నాడు డాక్టరు. కాని చాలా జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పాడు. నాన్న సంగతి అమ్మకి చెప్పటానికి వీలుందో లేదో?" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"రేపు వెళ్ళి డాక్టరుతో ఈ విషయం చెప్పు. ఆయన వద్దంటే ఆగు. ఇటువంటి సందర్భాలలోనే మనోధైర్యం తెచ్చుకోవాలి. మీవాళ్లెవరయినా ఉన్నారా?"

"లెక్కకు ఉన్నారు గాని వచ్చి నాకు సహాయం చేసేవారే లేరు."

"అయితే అమ్మగారిని కొంతకాలం నీవు సెటిల్ అయేవరకూ ఉంచితే మంచిదేమో? తొందరపడకు ఏడవటమేగాని ఆమె వచ్చి చేసేదేమీ లేదు. నీకా మరొక దిక్కులేదు. చిన్నవాడివయినా నీవే ధైర్యం తెచ్చుకోవాలి. నీకు భయ

మనిపిస్తే మా ఇంటికి వచ్చి పడుకో. లేకపోతే గుమాస్తా ఇంట్లో పడుకో"మని బుజ్జగిస్తూ చెప్పాడు.

మహేంద్రకు ఇంట్లోకి వెళ్ళబుద్ధి పుట్టలేదు. లోపల అడుగు పెట్టగానే హాస్పిటల్లో ఉన్న తల్లి జ్ఞాపకం వస్తుంది. తండ్రి మంచం ఖాళీగా కనపడుతుంది. ఎక్కడినుంచో "నాయనా మహీ, చదువుకోవట మయిందా? పడుకుంటావా?" అని తండ్రి అడుగుతున్నట్టుగా అనిపిస్తుంది." అతడు ఇల్లు తాళంవేసి గుమాస్తా యింటికి వెళ్ళి పడుకున్నాడు.

ఆ గుమాస్తాకు పిల్లలు లేరు. తల్లి ఉన్నది. ఆయన వంటచేసి తల్లికి పెట్టి గాని భోజనం చెయ్యడు. మహేంద్రను చూడగానే ఆమె ముచ్చటపడ్డది.

"నాయనా! నిన్ను చూస్తే నాకు ఎంత సంబరంగా ఉన్నదో చెప్పలేను. నీ మనసు కుదుటపడేవరకూ యిక్కడే ఉండు. నా కోడలు పురిటికెళ్ళిన మనిషి, బిడ్డనెత్తుకుని వస్తుందని ఆశపడ్డాను. కాని - ఇద్దరిలో ఎవరూ దక్కలేదు. ఇది లోకం. ఒకచోట నవ్వులూ ఒకచోట ఏడుపులూ వినిపిస్తూ ఉంటాయి. మనం ఆ రెంటికీ చూసి భరించుకోవాలి" అని దగ్గరగా కూర్చోబెట్టుకునేది. అతడికి వెంటనే తల్లి జ్ఞాపకం వచ్చేది.

ఆరోజు తండ్రికి ఆఫీసులో రావలసిన డబ్బును లెక్కచూసి ఆఫీసరు గుమాస్తాచేత పంపించినప్పుడు అతడికి మళ్ళీ తండ్రి పోయిననాడు కలిగినంత దుఃఖం వచ్చింది.

అతడు పిచ్చివాడిలా రోడ్లమీద తిరుగుతూ - ముసలమ్మ మాటలకు ఊరడిల్లుతూ రోజులు గడుపుతున్నాడు.

అప్పుడు వచ్చింది అతడికి ఐ.ఎ.ఎస్.లో సెలక్ట్ అయినట్టుగా ఉత్తరం.

అమావాస్య తరువాత పున్నమి వస్తుందంటే ఇదే కాబోలు అనుకున్నాడు మహేంద్ర.

తల్లిదగ్గరికి వెళ్ళి తన సెలక్షన్ సంగతి చెప్పి "ఎట్లా ఉన్నావమ్మా. ఒంట్లో బాగుందా?" అడిగాడు.

ఆమె కొడుకుని దగ్గరగా కూర్చోబెట్టుకుని "మహీ. నాన్న ఎంత సంతోష

పడతారో నీ సంగతి వింటే? ఏమిట్రా నాన్న రావటంలేదు ? కొన్ని నెలలయి పోయింది రాక. నేనిక్కడ బాగానే ఉన్నాననుకుని రావటం మానేశారా? ఇంక నా అంతట నేనే ఇంటికి వచ్చేస్తాను. ఆయనమీద ఇల్లు వదిలిపెట్టి చేతులు ముడుచు కుని కూర్చోనా ఇక్కడ?" గునిసింది.

మహేంద్ర తల్లి కళ్ళల్లోకి చూస్తూ నోట మాట లేకుండా నిలబడి పోయాడు.

తల్లి అడిగిన ప్రశ్నలకు తన దగ్గర జవాబు లేదు. నిజంగా ఆమె తనంతట తాను వచ్చేస్తుందేమో? వెంటనే ఆమె గుండె ఆగిపోతుంది.

తను ఢిల్లీ వెళ్ళాలి.

తన ముందు ప్రోగ్రాం తెలుసుకోవాలి.

"అమ్మా! నేను ఢిల్లీనుంచి వచ్చిన తరువాత ఇంటికి వస్తే బాగుంటుంది. నిన్ను ఇంటికి తీసుకువెళ్ళేటప్పుడు మందులూ, ఇంజక్షన్‌లూ ఎప్పుడు తీసుకోవల సిందీ మనం రాయించుకోవాలి. చెకప్‌లు చేయించుకోవలసి ఉంటుంది. ఆ పని నీవు చేయలేవు. నన్ను రానీ" అన్నాడు.

ఆమె మౌనం వహించింది.

"అమ్మా నన్ను పంపించవూ? నీ నోటితో 'వెళ్ళిరా' అను"

ఆమెకు తెలియకుండానే కన్నీళ్ళొచ్చాయి.

''నన్ను కన్నీళ్ళతో పంపిస్తావా అమ్మా?"

"కళ్ళనిండా నీళ్ళతో" వెళ్ళిరా నాయనా నాన్నా నేనూ ఇద్దరం నిన్ను స్టేషన్ వరకూ పంపుదామనుకున్నాంరా. నన్నిక్కడే ఉండమంటున్నావు. పోనీ నాన్ననయినా తీసుకెళ్ళు" అన్నది.

"అలాగేనమ్మా! అలాగే" అంటూ అతడు మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

ఆమె అలా ఆ కుర్చీలో కూర్చుని పెద్ద వాంతి చేసుకుంది.

ఆయా వచ్చి చూచేసరికి ఆమె కుర్చీవెనక్కు వాలిపోయింది పరుగెత్తు

కుంటూ వెళ్ళి డాక్టర్ని తీసుకువచ్చింది. డాక్టరు ఆమెను పడకమీదకు చేర్చమని చెప్పి ఒక ఇంజక్షను ఇచ్చాడు.

రాత్రి పన్నెండు గంటలకు మళ్ళీ ఒక ఇంజక్షన్ ఇచ్చాడు.

ఆమె మరింక లేవలేదు.